క్లుప్తంగా

8న ఉపమాకలో శివ కల్యాణం


పెళ్లిరాట వేస్తున్న అర్చకులు, భక్తులు

నక్కపల్లి: ఉపమాకలోని భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం ఈ నెల 8న వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం పెళ్లిరాట వేశారు. ఉపమాక వేంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, శివాలయం అర్చకుడు వెలవలపల్లి మహేష్, తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించి రాట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వీరబాబు, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, శివాలయం మాజీ చైర్మన్ వెంకటేశ్వరరావు, తాలూకా బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు డీవీ రామారావు, శ్రీపాద ప్రణవ్‌రామ్, నాయకులు మీగడ సత్తిబాబు, డీవీ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు


రాజయ్యపేటలో పెళ్లిరాట వేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ


నక్కపల్లి: సీతారాముల కల్యాణానికి ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 6న శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. రాజయ్యపేట, ఉపమాక, వేంపాడు, నెల్లిపూడి, నక్కపల్లి, దేవవరం, ఉద్దండపురం, తదితర గ్రామాల్లో వారం ముందు నుంచే పనులు చేస్తున్నారు. గురువారం రాజయ్యపేటలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ సీతారాముల కల్యాణానికి సంబంధించి పెళ్లిరాట వేశారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని తొమ్మిదిరోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కాసులమ్మ తెలిపారు. ఉపమాకలో పల్లపువీధి, మెరక వీధి రామాలయాల్లో శ్రీరామనవమిని పురస్కరించుకుని సప్తాహం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వారం రోజులుగా ప్రత్యేక బృందాలు భజన గీతాలు ఆలపిస్తున్నాయి.

పూడిమడక రోడ్డు విస్తరణకు సహకరించాలి


మాట్లాడుతున్న అనకాపల్లి ఆర్డీవో ఆయిషా

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అనకాపల్లి ఆర్డీవో ఆయిషా కోరారు. మండలంలో నాగులాపల్లిలో గురువారం రోడ్డు విస్తరణ బాధితులతో ఆమె సమావేశమయ్యారు. పూడిమడక రోడ్డు విస్తరణలో భూములు, గృహాలు కోల్పోయిన బాధితులకు మెరుగైన పరిహారం అందజేస్తామన్నారు. టీడీఆర్ బాండ్లను అందజేస్తామని, విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు, సర్పంచ్ జామి చినమ్మలు, మాజీ సర్పంచ్ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


పాఠశాలలో సరస్వతి దేవీ విగ్రహానికి పూలమాల వేస్తున్న గ్రామ పెద్దలు

ఎస్.రాయవరం: గోకులపాడు ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఆటపాటలతో విద్యార్థులు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నాగంబోయిన శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ అద్దేపల్లి నూకునాయుడు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అద్దేపల్లి బొజ్జన్న, తదితరులు పాల్గొన్నారు.

యండపల్లిపాలెంలో సప్తాహం


యండపల్లిపాలెంలో హరేరామ హరేకృష్ణ నామసంకీర్తన చేస్తున్న భక్తజనం

దేవరాపల్లి: మండలంలోని కె.ఎం.పాలెం పంచాయతీ శివారు యండపల్లిపాలెంలో భక్తి శ్రద్ధలతో సప్తాహం నిర్వహిస్తున్నారు. స్థానిక రామాలయంలో తొమ్మిది రోజుల పాటు పగలు 24 గంటలు ఏకధాటిగా హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన కొనసాగుతోంది. దేవానంద స్వామిజీ భక్త సమాజం ఆధ్వర్యంలో ఉగాది రోజు ప్రారంభమైన నామ సంకీర్తన శ్రీరామనవమితో ముగుస్తుందని స్థానిక భక్తులు తెలిపారు.

కాలుష్య కాసారం!


సాయిమెరైన్ పరిశ్రమ వ్యర్థాలతో రంగుమారి కలుషితమైన పంట కాలువ నీరు

- వరాహనది పంట కాలువలోకి విష వాయువులు
- సాయిమెరైన్ పరిశ్రమ వ్యర్థాలు యథేచ్ఛగా విడుదల
- మత్స్య సంపదకు తప్పని ముప్పు

ఎస్.రాయవరం: వరాహనది(పాయ) పంట కాలువ కాలుష్య కాసారంగా మారింది. సాయి మెరైన్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నుంచి యథేచ్ఛగా వ్యర్థాలు కాలువలోకి విడిచి పెడుతుండడంతో మత్స్య సంపదకు ముప్పు వాటిల్లుతోంది. సమీప చెరువులు సైతం కాలుష్యంతో సతమతమవుతున్నాయి. మండలంలో గుడివాడ రెవెన్యూ పరిధిలో గత టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సాయి మెరైన్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నుంచి నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను నేరుగా వరాహనది పంట కాలువలోకి విడుదల చేస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లో తాగునీరు పూర్తిగా కలుషితంగా మారింది. ఈ కాలువలో నీరు విషపూరితంగా మారడంతో ఇప్పటికే చేపలు చనిపోగా.. పశువులు తాగి రోగాల బారిన పడుతున్నాయి. ఇప్పటికే పదికి పైగా పశువులు మృత్యువాత పడ్డాయని బాధిత పాడి రైతులు చెబుతున్నారు.

కాలువలోకి విడిచిపెట్టిన వ్యర్థాలు సుమారు ఆరు కిలోమీటర్ల మేర ప్రవహించి బంగారమ్మ పాలెం మొగలో సముద్రంలో కలుస్తుంది. ఈ మధ్య ప్రాంతంలో ఈ నీటిని వ్యవసాయం, పశువులు, మొక్కలకు ఉపయోగిస్తారు. ఇప్పుడు నీరు పూర్తిగా కలుషితం కావడంతో కాలువ నీరు నిరుపయోగంగా మారింది. పరిశ్రమ వ్యర్థాలతో కూడిన ఈ నీరు ప్రస్తుతం తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. ఈ సమస్యను భరించలేక ఏడాది కాలంగా రేవుపోలవరం, కొత్త రేవుపోలవరం, గుడివాడ, కొత్త పోలవరం, లక్ష్మీపతిరాజు గ్రామాల ప్రజలు ఇప్పటికే పలుమార్లు ఆందోళనకు దిగారు. ఆ సమయంలో పరిశ్రమ యాజమాన్యం స్పందిస్తూ తాత్కాలికంగా నచ్చజెప్పి పంపిస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలు ఉండటం వల్ల నివారణ చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పర్యావరణ శాఖ అధికారులు కూడా సమస్యను పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇక పంచాయతీ అధికారులు అయితే ఇటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇప్పటికైనా పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చిన అధికారులు పర్యవేక్షించి స్థానికంగా తలెత్తుతున్న సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.


ఇటీవల పరిశ్రమ వద్ద ధర్నాకు దిగిన పరిసర గ్రామాల ప్రజలు(ఫైల్)


కాలువ నుంచి కలుషిత నీరు చేరడంతో పాడైన చెరువు


కాలువలోకి విడుదలవుతున్న పరిశ్రమ వ్యర్థపు నీరు

విచ్చలవిడిగా వ్యర్థాల విడుదల



కొత్తపోలవరం పంట కాలువలోకి సాయి మెరైన్ కంపెనీ నుంచి వ్యర్థాలు యథేచ్ఛగా విడుదల చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాకతో మరింత విచ్చలవిడిగా విడిచి పెడుతున్నారు. పరిశ్రమ నుంచి నేరుగా కాలువలోకి పైపులైను వేసి వ్యర్థపు నీటిని వదులుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి.

– మామిడి చంటి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

దుర్వాసన భరించలేకపోతున్నాం..



సాయి మెరైన్ పరిశ్రమ వ్యర్థాల కారణంగా గ్రామంలోకి దుర్వాసన వస్తోంది. భరించలేకపోతున్నాం. దోమలు సమస్య తీవ్రంగా పెరిగింది. ఇప్పటికే పలువురు అనారోగ్యం బారిన పడ్డారు. తాగునీరు కలుషితం అవుతోంది. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

– యలమంచిలి అప్పారావు, లక్ష్మీపతిరాజుపేట

వ్యర్థాల సమస్య ఉన్నట్టు తెలిసింది..



సాయి మెరైన్ పరిశ్రమ వ్యర్థాల వల్ల సమస్య తలెత్తినట్టు తెలిసింది. పరిశ్రమల అధికారులకు నేరుగా ఫిర్యాదు చేయాలి. నా దృష్టి వస్తే కాలుష్య నియంత్రణ శాఖాధికారులకు నివేదిస్తాం. గ్రామాల్లో పారిశుధ్య సమస్య వస్తే చర్యలు తీసుకుంటాం.

– ఎస్.సత్యనారాయణ, ఇన్‌చార్జి ఎంపీడీవో, ఎస్.రాయవరం

గంగాదేవిపేట అభివృద్ధికి కృషి


భూమి పూజ చేస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

మునగపాక: గంగాదేవిపేట గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నామని మూలపేట సర్పంచ్ గంగ అప్పలనాయుడు తెలిపారు. గురువారం గంగాదేవిపేటలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగాదేవిపేట అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మొల్లేటి దేవీ చంద్ర, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

నక్కపల్లి: మండలంలో పెద బోదిగల్లం జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. పదో తరగతి పూర్తి చేసుకుంటున్న విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆట పాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ముందుగా గతేడాది పాఠశాలలో సాధించిన ప్రగతిని హెచ్ఎం చోడిశెట్టి సత్యనారాయణ వివరించారు. విద్యార్థులు చేసిన డ్యాన్స్‌లు, వివిధ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పదో తరగతి అనంతరం ఏ కోర్సు చదవాలనే దానిపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆచార్యులు, ఏవీఎల్ కుమారి, ఫల్గుణరావు, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కర్రివానిపాలెంలో రాములోరి పెళ్లిరాట


కర్రివానిపాలెంలో పెళ్ల రాట వేస్తున్న భక్తులు


నాగులాపల్లిలో పెళ్లిరాట కార్యక్రమంలో భక్తులు

ఎస్.రాయవరం: కర్రివానిపాలెంలోని సీతారామాలయంలో శ్రీరామనవమి వేడుకలు పురస్కరించుకుని స్వామివారి పెళ్లిరాట గురువారం వేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు సంప్రదాయబద్ధంగా పెళ్లి రాట వేశారు. గ్రామ ఇలవేల్పు కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర కూడా గురువారం ప్రారంభమైనట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి గరగలు, పలు రకాల పూజలు గ్రామంలో గురువారం నుంచి 15 రోజుల పాటు నిర్వహించి చివరి రోజున భారీ ఎత్తున జాతర చేస్తామన్నారు.

మునగపాక: మండలంలో నాగులాపల్లి గ్రామంలో గురువారం పెళ్లిరాట మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ నెల 6న జరగనున్న శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా సీతారాముల కల్యాణ రాట వేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉజ్వల భవిష్యత్తు


శిక్షణ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ ఉమాశంకర్

కశింకోట: పాలిటెక్నిక్ విద్య ఇంజినీరింగ్ కోర్సులు చదవడానికి, ఉద్యోగావకాశాలు పొందడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆర్ఈసీఎస్‌లోని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.ఉమాశంకర్ అన్నారు. కశింకోటలోని ఆర్ఈసీఎస్‌లో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత పాలిసెట్ శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలిటెక్నిక్‌లో ఏ బ్రాంచి చదవాలి, ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి.. వంటి అంశాలను వివరించారు. ఆర్ఈసీఎస్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల పిల్లలు, జిల్లాలోని టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఉచిత శిక్షణ తరగతులను వినియోగించుకోవచ్చునన్నారు. తరగతులు రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయని చెప్పారు. శిక్షణకు వచ్చే ప్రతి విద్యార్థికి స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. ఇంకా పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేయని విద్యార్థులకు కళాశాలలో ఉచితంగా దరఖాస్తు చేయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రిన్సిపాల్ కర్రి శివ, జనరల్ సెక్షన్ విభాగాధిపతి ఎస్.గణేష్, ఎలక్ట్రికల్ విభాగాధిపతి పి.రమణకుమార్, సీనియర్ లెక్చరర్లు వై.వీరేంద్ర, ఎం.జగదీష్, పాల్గొన్నారు.

3వ రోజూ కొనసాగిన క్వారీ కార్మికుల సమ్మె


క్వారీ కార్మికుల సమ్మెను ఉద్దేశించి మాట్లాడుతున్న పండా గణేష్

అనకాపల్లి: మండలంలోని క్వారీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఆయా యాజమాన్యాలు చర్యలు చేపట్టకపోవడం అన్యాయమని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు పండా గణేష్ అన్నారు. బవులవాడ పంచాయతీ దర్జీనగర్ గ్రామంలో తలపెట్టిన క్వారీ కార్మికుల సమ్మెకు గురువారం ఆయన సంఘీభావం తెలిపి, మాట్లాడారు. గత మూడు రోజులుగా కార్మికులు సమ్మె చేస్తుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు, క్వారీ యాజమాన్యం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మికులకు ఎటువంటి భద్రత, హక్కులు లేకుండా చేసిందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వారీ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కోన మోహనరావు, సంఘం నాయకులు శానాపతి అప్పలనాయుడు, చింతల రమేష్, ఎ.అప్పలనాయుడు, లింగ, సీహెచ్.చిన్నారావు, చవితిన నూకరాజు, గొరప్రల్లి తాతబాబు, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చింపేట పీహెచ్‌సీలో వసతులపై కేంద్ర బృందం ఆరా


సిబ్బంది విధుల గురించి తెలుసుకుంటున్న కేంద్ర వైద్య ప్రతినిధి

రోలుగుంట: మండలంలోని బుచ్చింపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర వైద్య బృందం సభ్యులు గురువారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలు, మౌలిక వసతులపై ఆరా తీశారు. సిబ్బంది, మందుల కొరత, వసతులు, తదితర అంశాలపై వైద్యులు సునీత, శ్రీనివాసురాజుతో చర్చించారు. దీనిలో భాగంగా ఏఎన్ఎంలను రోగులకు అందిస్తున్న సేవలు, ప్రసవాల వివరాలు నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఫార్మాసిస్ట్ కొండబాబును మందుల కొరతపై ఆరా తీశారు. రోగులతో మాట్లాడి సమస్యలు, వైద్య సేవలు, సిబ్బంది తీరు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు వాసంతరెడ్డి హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు వచ్చేలా చర్యలు చేపట్టాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

అనకాపల్లి టౌన్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు వచ్చేలా చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కాంప్లెక్స్‌లో విద్యార్థులతో కలిసి వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడి సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే సమీపంలో ఉన్న బైపాస్‌కు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. జిల్లా కేంద్రంగా మారినా కాంప్లెక్స్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు రావడంలేదని, వెంటనే సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని బొడ్డేడ అప్పారావు, బోట్టా చిన్నియాదవ్, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరావు, తదితరులు కోరారు.

ఎక్సైజ్ స్టేషన్ వద్ద నిరసన


ఎక్సైజ్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

నర్సీపట్నం: సంప్రదాయ జీలుగు కల్లు దొరికిందని గిరిజనులపై కేసులు పెట్టడం సరికాదని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.గోవిందరావు పేర్కొన్నారు. కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ గురువారం ఆదివాసీలు స్థానిక ఎక్సైజ్ స్టేషన్ వద్ద నిరసన తెలియజేశారు. కొర్రా కొండబాబు, వంతల సురేష్, మర్రి రాజుబాబుపై కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ఆదివాసీలు మైదాన ప్రాంతాల్లో తాటి, జీలుగు చెట్ల నుంచి కల్లు తీస్తాయన్నారు. సంప్రదాయ పానీయమే తప్ప కంపెనీల్లోనూ, కృత్రిమంగా తయారు చేసిన సారా, బ్రాందీ వంటివి కావన్నారు. వీటిపై ఆధారపడి వేలాది వెనుకబడిన కులాలు జీవిస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఆదివాసీలకు జీలుగు కల్లు మినహాయింపు ఇచ్చిన విషయం మరిచి ఎక్సైజ్ పోలీసులు కేసులు పెడుతున్నారన్నారు. కేసులు పెట్టడాన్ని ఎక్సైజ్ పోలీసులు విరమించుకోవాలన్నారు.

విజయనగరం జెడ్పీ చైర్మన్‌కు పరామర్శ


చిన్న శ్రీనును పరామర్శిస్తున్న కంబాల, కురసాల, చిక్కాల

పాయకరావుపేట: వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను)ను ఆ పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, తదితరులు గురువారం పరామర్శించారు. చిన్న శ్రీను కుమారుడు ఆదిత్య ప్రణీత్ బాబు పెద్దకర్మ సందర్భంగా విజయనగరంలోని చిన్న శ్రీను ఇంటికి వెళ్లి పరామర్శించి, ధైర్యం చెప్పారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై 12న సదస్సు


విద్యుత్ ఉద్యోగుల సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్.శంకరరావు

అనకాపల్లి: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 12న విశాఖ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నట్టు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు తెలిపారు. స్థానిక గవరపాలెం విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద సదస్సు కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికుల జీతాలను పెంచాలని, కొత్త పీఆర్సీ అమలు చేయాలని, బకాయి డీఏలను తక్షణమే చెల్లించాలని కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, మోదీ తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణ చట్టాన్ని మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వేగంగా అమలు చేస్తూ అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు విద్యుత్ రంగాన్ని కట్టబెట్టాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పీస్ రేట్ పేరుతో విద్యుత్ ఉద్యోగులను మోసం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రేమ చంద్రశేఖర్, డివిజన్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, వర్కింగ్ అధ్యక్షుడు ఎస్.డి.అప్పారావు, సహాయ కార్యదర్శి ఎం.రామకృష్ణ, ఉపాధ్యక్షుడు కె.జైరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పని భారంపై అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన

కశింకోట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని జెట్టపురెడ్డితునిలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేశారు. జెట్టపురెడ్డితుని సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు పనికి తగ్గ వేతనం అందించాలన్నారు. పని భారం తగ్గించాలన్నారు. గతంలో కన్నా అనేక యాప్‌ల ద్వారా డేటా నింపడానికి సమయం సరిపోతోందన్నారు. బాల సంజీవని 2.0 యాప్ సమర్థవంతంగా పని చేసేలా మెరుగుపర్చాలన్నారు. గ్రామాల్లో పింఛన్ల పంపిణీ నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలను మినహాయించాలని కోరారు.

నిఘా ప్రాంతాల్లో డ్రోన్‌తో పర్యవేక్షణ


డీఎస్పీ సమక్షంలో డ్రోన్ కెమెరాను ఆపరేట్ చేస్తున్న పోలీసు సిబ్బంది

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఉన్న ప్రాంతాల్లో రోజూ డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేశామని డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం డీఎస్పీ సమక్షంలో ట్రైనీ డీఎస్పీ చైతన్య, సీఐ గోవిందరావు, సిబ్బంది డ్రోన్ కెమెరాతో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శివపురం, గుర్రాల రోడ్డు, ఇందిరా మార్కెట్, బలిఘట్టం శివాలయం, డిగ్రీ కాలేజీ, పెదబొడ్డేపల్లి చెరువు ప్రాంతాల్లో డ్రోన్ నిఘా పెట్టామన్నారు. బహిరంగంగా మద్యం సేవించినా, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించినా పోలీసులకు దొరుకుపోతారన్నారు. డ్రోన్ ద్వారా బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించారు.